నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 18 జూన్ 2024 | SURYAPET



సూర్యాపేటలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

## త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్

- సమాజంలో ఒకరికొకరు సాయపడేలా బతకాలి
- మాజీ సీఎం కేసీఆర్‌తోనే పండుగలకు గుర్తింపు : మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, జూన్ 17 : త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా సోమవారం సూర్యాపేటలోని జనగాం క్రాస్‌రోడ్డు బాషానాయక్ తండా వద్ద ఈద్గాలో నిర్వహించిన ముస్లింల సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధితోపాటు ఇతరులకు సాయం చేయడంలో భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్‌తోనే పండుగలకు గుర్తింపు లభించిందని, దీనిని ఇలాగే కొనసాగించాలని కోరారు. అన్ని పండుగలను ప్రభుత్వం గౌరవిస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మంచి వాతావరణం ఏర్పడుతుందని, తెలంగాణ రాష్ట్రం భారతదేశానికి ఎప్పుడూ ఆదర్శంగా ఉండే విధంగా ప్రభుత్వం పని చేయాలని అన్నారు. గత పదేండ్లలో శాంతి సామరస్యాలను పెంపొందించి, అన్ని రంగాలను కేసీఆర్ అభివృద్ధి చేశారని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జడ్పీటీసీ జీడి భిక్షం, ఎస్కే రఫీ, జలీల్, సయ్యద్ సలీం, జానీ తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ ఎస్పీగా శరత్ చంద్ర పవార్

- రైల్వే ఎస్పీగా చందనా దీప్తి బదిలీ

నల్లగొండ ప్రతినిధి, జూన్ 17(నమస్తే తెలంగాణ) : మూడు రోజుల వ్యవధిలో నల్లగొండ జిల్లా పాలన రథసారథులిద్దరూ బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరూ జిల్లాకు ఈ ఏడాది తొలి వారంలోనే రావడం.. వచ్చిన ఆరు నెల్లలోపే బదిలీ కావడం విశేషం. ఈ నెల 15న కలెక్టర్ హరిచందన బదిలీ కాగా తాజాగా సోమవారం జిల్లా ఎస్పీ చందనా దీప్తికి కూడా స్థాన చలనం తప్పలేదు. చందనాదీప్తి స్థానంలో స్టేట్ నార్కోటిక్స్ విభాగం ఎస్పీగా పని చేస్తున్న 2016 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ శరత్ చంద్ర పవార్‌ను జిల్లా ఎస్పీగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. చందనా దీప్తికి రైల్వేస్ ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. వాస్తవంగా అసెంబ్లీ ఎన్నికల తరువాత అప్పటివరకు ఉన్న జిల్లా పాలన యంత్రాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ చివరి వారంలో మార్చింది. ఈ ఏడాది జనవరి 1న అపూర్వరావు స్థానంలో ఎస్పీగా చందనా దీప్తి బాధ్యతలు చేపట్టారు. సరిగ్గా 5 నెలల 17 రోజులకే బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల కాలంలో ఇంత తక్కువ వ్యవధిలో బదిలీ అయిన ఎస్పీ చందనా దీప్తినే అవడం గమనార్హం. అటు బదిలీ అయిన కలెక్టర్ హరిచందన కూడా ఈ ఏడాది జనవరి 8న బాధ్యతలు చేపట్టారు. వీరు ఇరువురు వచ్చినప్పటి నుంచి పార్లమెంట్ ఎన్నికలు, ఆ తర్వాత పట్టభద్రుల ఎన్నికల హడావుడే సరిపోయింది. ఎన్నికల్లో పోలింగ్, కౌంటింగ్ సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎక్కువ ఎఫెర్ట్ పెట్టాల్సి వచ్చింది. ఇక ఎన్నికలు ముగిశాయి కాబట్టి జిల్లా పాలనపై దృష్టి సారిస్తున్న సమయంలోనే ఊహించని విధంగా ఇద్దరినీ మూడు రోజుల తేడాతో ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ బదిలీల్లో జిల్లా కలెక్టర్‌గా వచ్చిన సి. నారాయణరెడ్డి ఆది వారమే బాధ్యతలు స్వీకరించారు. ఇక చందనా దీప్తి స్థానంలో ఎస్పీగా బదిలీపై వస్తున్న శరత్ చంద్ర పవార్ మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది. మూడు రోజుల వ్యవధిలో జరిగిన ఐఏఎస్, ఐపీఎస్ బదిలీల్లో సీఎం రేవంత్ రెడ్డి మార్క్ కనిపిస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. జిల్లాల మంత్రులు, ఇతర ముఖ్యులతో సంబంధం లేకుండానే పూర్తిగా సీఎం రేవంత్ రెడ్డి కనుసన్నుల్లోనే జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల బదిలీలు జరిగినట్లు సమాచారం.



నల్లగొండ కొత్త ఎస్పీ శరత్ చంద్ర పవార్

## సూర్యాపేట ఎస్పీగా సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట సిటీ : సూర్యాపేట నూతన ఎస్పీగా సన్‌ప్రీత్ సింగ్ నియామకం అయ్యారు. ప్రస్తుతం జగిత్యాల ఎస్పీగా పనిచేస్తున్న 2011 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సన్‌ప్రీత్ సింగ్ ఇక్కడకు బదిలీపై రానున్నారు. కాగా సూర్యాపేట ఎస్పీగా పనిచేస్తున్న రాహుల్ హెగ్డే హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ అయ్యారు.





సన్‌ప్రీత్ సింగ్

## రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం

నల్లగొండ సిటీ, జూన్ 17 : కనగల్ మండలం దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు సోమవారం పరిపూర్ణమయ్యాయి. చివరి రోజు ఉదయం అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ఏకాంతసేవతోపాటు ఆలయం వద్ద 108 కలశాలతో అష్టోతర శతఘటాభిషేకం, హోమాలు, త్రిశూల స్నానం, బలిహరణ, మహాపూర్ణ, అవబృథం నిర్వహించారు. సాయంత్రం దర్వేశిపురం, పర్వతగిరి గ్రామాల నుంచి పెద్దఎత్తున బోనాలను పరశురాముడి విగ్రహం వద్దకు తీసుకొచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. ఈఓ జయరామయ్య, సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్య, దేవాలయ మాజీ చైర్మన్లు కరుణాకర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్నగాని నాగేశ్‌గౌడ్, ఆలయ అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రావణ కుమారాచార్యులు, సుదర్శనాచార్యులు, గాదె మహేశ్, దామోదరరావు పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు తీసుకొస్తున్న మహిళలు

# భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ఈద్‌గాహ్, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు



రామగిరి, జూన్ 17 : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మిర్యాలగూడలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సూర్యాపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, వివిధ ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మత గురువులు బక్రీద్ ప్రత్యేకతను, ఖురాన్‌లోని విషయాలను వివరించారు.



మిర్యాలగూడలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



నల్లగొండ ఈద్‌గాహ్‌లో ముస్లిం మత పెద్దకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సూర్యాపేటలో ముస్లింల ప్రార్థనలు

## పీఈటీల పదోన్నతుల్లో నకిలీ సర్టిఫికెట్లపై విచారణ

**ఇన్ సర్వీస్ శిక్షణ కాలం, చదివిన కళాశాలలో హాజరు పరిశీలన**

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రామగిరి, జూన్ 17: పీఈటీల అప్‌గ్రెడేషన్ (స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ ఉపాధ్యాయులు)లో నకిలీ సర్టిఫికెట్లపై విచారణ కొనసాగుతున్నది. నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 16న ప్రచురితమైన 'పీఈటీల పదోన్నతుల్లో నకిలీ సర్టిఫికెట్ల కలకలం' వార్తకు అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో నకిలీలుగా గుర్తించిన 12 మంది ఉపాధ్యాయులను ప్రత్యేకంగా డీఈఓ కార్యాలయానికి పిలిచారు. వారికి సంబంధించిన సర్టిఫికెట్స్, ఇన్ సర్వీసులో శిక్షణ పూర్తి చేసిన కాలం, యూనివర్సిటీ, కళాశాలల అంశాలను పరిశీలిస్తున్నారు. 12 మందిలో 11మంది పీఈటీలు శిక్షణ పూర్తి చేయగా వారు ఏకాలంలో ఇటు పాఠశాలకు, మరో వైపు కళాశాలలో తరగతులకు హాజరైనట్లు గుర్తించినట్లు సమాచారం. చింతపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ తాను సర్వీసు పుస్తకంతోపాటు నకిలీ బీపీఈడీ సర్టిఫికెట్ చూపించినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు డీఈఓ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి ద్వారా తెలిసింది.

### పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నాం : డీఈఓ భిక్షపతి

'పీఈటీల పదోన్నతుల్లో నకిలీ సర్టిఫికెట్స్, సర్వీస్ పుస్తకం సమర్పించిన వారిని గుర్తించాం. వీరిలో ఒక్కరు తప్ప మిగిలిన ఉపాధ్యాయులు ఇన్ సర్వీసులు పూర్తి చేసి, వ్యాయామ విద్య శిక్షణలో సెలవులు పెట్టకుండా ఏకాలంలో శిక్షణకు హాజరైనట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. మరి కొందరు సెలవులు పెట్టినప్పటికీ శిక్షణ కాలం సంవత్సరం కోర్సులో ఆ కళాశాలల పని చేసిన కాలం, పాఠశాలలో వారి హాజరు విషయంలో తేడాలున్నట్లు తెలిసింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతున్నది. నిర్ధారణ కమిటీ నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తాం. ఆ తర్వాత ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం'.

## 100 రోజులు.. 46 లక్షల మంది భక్తులు

- స్వర్ణగిరికి దేశ, విదేశాల నుంచి భక్తజనం
- ఊహించిన దానికంటే 10రెట్లు అధికంగా రాక
- భక్తులకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు మెరుగు
- ట్రస్ట్‌ల ద్వారా రూ.12.49కోట్ల ఆదాయం
- 8వేల మందికి నిత్యాన్నదానం
- ఆన్‌లైన్‌లో అన్ని ఆర్జిత సేవలు ప్రారంభం
- వచ్చే నెలలో అందుబాటులోకి కాటేజీలు
- స్వర్ణగిరి ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు

యాదాద్రి భువనగిరి, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరీశుడి దర్శనం ప్రారంభమై వంద రోజులు పూర్తయ్యిందని, క్షేత్రానికి ఇప్పటి వరకు 46లక్షల మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు తెలిపారు. ఆలయ ప్రతిష్ట చేసి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర నలుమూలల నుంచే గాక దేశ, విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని వివరించారు. ఇప్పటివరకు వివిధ ట్రస్ట్‌ల ద్వారా రూ.12.49కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. ఆలయానికి వచ్చే ప్రతి పైసా భక్తుల కోసమే ఖర్చు చేస్తామని, ఒక్క పైసా దుర్వినియోగం చేయబోమని తెలిపారు. దేశంలోనే ఆధునిక ఆర్కిటెక్చర్‌లో అయోధ్య రామమందిరం తర్వాత స్వర్ణగిరి రెండో స్థానంలో నిలిచిందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా వచ్చే నెలలో కాటేజీలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. భక్తుల భద్రత కోసం పోలీసులతో సమన్వయం చేసుకుంటున్నామని, సీసీ కెమెరాలు, స్కానర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

### ఆన్‌లైన్‌లో అన్ని ఆర్జిత సేవలు..

స్వర్ణగిరీశుడికి ఆర్జిత సేవలు ఇకపై పూర్తిస్థాయిలో భక్తులకు అందుబాటులో ఉండనున్నట్లు రామారావు తెలిపారు. షోడశోపచార సేవల్లో భాగంగా ఉదయం 5గంటల ప్రారంభమయ్యే సుప్రభాత సేవ మొదలుకొని ఏకాంత సేవ వరకు 16 ఆర్జిత సేవలను www.ytdtemple.com వెబ్‌సైట్‌లో ఆన్ లైన్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. సేవల బుకింగ్ కోసం భక్తులు క్యూలైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. మధ్యాహ్నం 1.30గంటల నుంచి 2.30గంటల వరకు మాత్రమే విరామం ఉంటుందని.. శని, ఆది వారాల్లో ఉదయం 8గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిరంతరాయంగా స్వామివారిని దర్శించుకోవచ్చన్నారు.

### భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు..

స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మానేపల్లి రామారావు తెలిపారు. తాము ఊహించిన దానికంటే పదిరెట్లు అధికంగా భక్తులు వస్తున్నారని, రోజురోజుకు సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. వృద్ధులకు వీల్‌చైర్ ద్వారా స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

మొదట్లో 35 మంది సిబ్బంది ఉండగా, ఇప్పుడు 450 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని వివరించారు. భక్తుల కోసం నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నామని, ప్రారంభంలో రెండు వేల మందికి మాత్రమే పరిమితం కాగా.. ఇప్పుడు రోజుకు 8 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. విరాళాలు అన్నింటికీ సెక్షన్ 80జీ ద్వారా ఆదాయ పన్ను మినహాయింపు ఉందన్నారు. భక్తుల కోసం స్వామివారికి ప్రీతిపాత్రమైన గోశాలను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఉప్పల్ నుంచి క్షేత్రానికి బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. శాశ్వత వీధి దీపాలు, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తలు మురళీకృష్ణ, గోపీకృష్ణ, అర్చకులు శ్రవణాచార్య, స్థపతి డీఎన్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

# న్యూట్రిషన్ కిట్లు బంద్!

**నాలుగు నెలలుగా నిలిచిపోయిన సరఫరా**

- పుట్టబోయే శిశువుకు అందని పౌష్టికాహారం
- బీఆర్‌ఎస్ హయాంలో గర్భిణులకు రెండుసార్లు కిట్లు అందజేత
- పట్టించుకోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం
- జనవరి నుంచి మే వరకు సూర్యాపేట జిల్లాలో 4,980 ప్రసవాలు
- రేవంత్ సర్కారు తీరుపై మహిళల పెదవి విరుపు
- ప్రసవానంతరం ఇచ్చే కేసీఆర్ కిట్లు కూడా బంద్

సూర్యాపేట, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : పుట్టబోయే శిశువు పూర్తి ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లోపం ఉండొద్దనే ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు హయాంలో అందించిన న్యూట్రిషన్ కిట్లకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. నాలుగు నెలలుగా గర్భిణులకు ఇవ్వాల్సిన సుమారు ఆరు వేల కిట్లు అందలేదు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకు ఐదు, తొమ్మిదో నెలల్లో మొత్తం రెండు సార్లు రూ.2వేల విలువ చేసే పోషకాహారాలతో కూడిన కిట్లను గత ప్రభుత్వం అందించింది. ఇవి గత ఫిబ్రవరి వరకు సజావుగా ప్రస్తుతం వాటి ఊసే లేకుండా పోయింది. ఇక గర్భిణులు, పుట్టిన శిశువులకు గతంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లను ఎంసీహెచ్ కిట్లుగా పేరు మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని కూడా నిలిపివేయడం పట్ల మహిళలు గుర్రుగా ఉన్నారు.

### ఒక్కరికి రూ.2వేల విలువ చేసే కిట్లు

ఆరు గ్యారెంటీలు, అనేక అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. కొత్త హామీల అమలు అలా ఉంచితే గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను కూడా అమలు చేయడం లేదు. ప్రధానంగా పుట్టబోయే శిశువులు పూర్తి ఆరోగ్యంగా, బలవర్ధకంగా ఉండాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన న్యూట్రిషన్ కిట్ల పంపిణీ ఆగిపోయింది. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే శిశువులు ఆరోగ్యకరంగా పెరుగుతారని ఆలోచన చేసి గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకు రెండు సార్లు రూ.2 వేల వ్యయంతో న్యూట్రిషన్ కిట్లు అందించింది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతో కూడిన కిట్లను ఐదు, తొమ్మిదో నెలలో ఇచ్చింది. కిట్లలో రెండు కిలోల న్యూట్రిషన్ మిక్స్‌డ్ పౌడర్, కిలో ఖర్జూర, 500 గ్రాముల నెయ్యి, ఐరన్ సిరప్ 3 బాటిళ్లు, ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు, ఒక కప్పు ఇతర వస్తువులు ఉండేవి.





### జనవరిలో ఆగిన కిట్లు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నవంబర్ 2023లో సరఫరా చేసిన న్యూట్రిషన్ కిట్లు సుమారు జనవరి వరకు వచ్చాయి. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి మే వరకు 4,980 మంది ప్రసవాలు జరిగాయి. ఐదు నెలల కాలంలో కొంత మంది గర్భిణులకు ఒకటి, మిగిలిన వారికి వారికి రెండు సార్లు చొప్పున న్యూట్రిషన్ కిట్లు అందాల్సి ఉంది. ఈ లెక్కన ఐదు నెలల్లో దాదాపు 8,950 కిట్లు అందాల్సి ఉండగా సరఫరా నిలిచిపోయింది. వీటితోపాటు ప్రసవం తర్వాత తల్లీబిడ్డలకు అవసరమైన 13వేల రూపాయల విలువ చేసే కేసీఆర్ కిట్లను రేవంత్ సర్కార్ పేరు మార్చి ఎంసీహెచ్ కిట్‌గా నామకరణం చేసినప్పటికీ కొత్తగా ఒక్క కిట్ కూడా పంపిణీ చేయలేదు. న్యూట్రిషన్ కిట్ల మాదిరి ఎంసీహెచ్ కిట్లను కూడా గతేడాది నవంబర్‌లో వచ్చిన వాటిని ఫిబ్రవరి వరకు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువు సంక్షేమం కోసం చేపట్టిన న్యూట్రిషన్, కేసీఆర్ కిట్లను నిలిపివేయడం పట్ల మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సమాజ మనుగడకు సాహిత్యం మార్గదర్శనం

- తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి
- మోత్కూరులో మమతల పందిరి పుస్తకావిష్కరణ



మమతల పందిరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి, చిత్రంలో రచయిత మర్రి జయశ్రీ, ప్రముఖులు

మోత్కూరు, జూన్ 16 : సమాజ మనుగడకు ప్రాచీనా సాహిత్యం మార్గదర్శనమని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. మోత్కూరు ప్రజా భారతి సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ పూర్వ ప్రధాన కార్యదర్శి, కవి, తెలుగు ఉపాధ్యాయురాలు మర్రి జయశ్రీ రచించిన 'మమతల పందిరి' పుస్తకాన్ని సోమవారం మోత్కూరులోని ఓ ఫంక్షన్‌లో సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్‌తో ఆయన కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ యాస, భాష భవిష్యత్‌లో అంతరించి పోయే ప్రమాదముందని, తెలుగు భాషను ముందు తరాల వారికి అందించేందుకు మంచి సంస్కృతితో నడువాలని అన్నారు. కవులతో సమాజానికి మేలు జరుగుతుందని, సాహితీ పరులు, ఉద్యమకారులకు ఈ ప్రాంతం నిలయమైందని తెలిపారు. మోత్కూరు ప్రజాభారతి ప్రోత్సాహంతో తనకు పేగు బంధం సాహిత్య బంధమైందని చెప్పారు. ప్రముఖ గేయ రచయిత అభినయ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు అనేక ఉద్యమాల్లో మోత్కూరు ముందు నిలిచిందన్నారు. అనంతరం మమతల పందిరిని అందించిన మర్రి జయశ్రీని అభినందించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య గ్రంథ సమీక్ష చేశారు. సంస్థ అధ్యక్షుడు దేవినేని అరవిందరాయుడు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ దామల రాంప్రసాద్, కులీకుతుబ్ షా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మీసాల సైదులు, రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు జయశ్రీ, మోత్కూరు విశ్రాంత తాలుకా సంఘం పూర్వ అధ్యక్షుడు మర్రి ఆనందం, కేరళ నాభి అకాడమీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గోలి రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ బండ్ల రవికుమార్, మర్రి అనిల్‌కుమార్, మేక శివకుమార్, ఎస్ఎన్‌చారి, జి.వెంకన్న, రాంప్రసాద్, విజయలక్ష్మి, కూరెళ్ల శ్రీనివాస్, సుజాత, లక్ష్మీ నర్సింహరెడ్డి, మహేందర్, గాదె వెంకన్న, రాజు పాల్గొన్నారు.